# ఏఐఎఫ్‌టియు(న్యూ) ఆధ్వర్యంలో 'మేడే' జెండా ఆవిష్కరణలు

**'భారత** ప్రజల జీవితాల్లో సంక్షోభాన్ని సృష్టిస్తున్న దోపిడీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతాంగం, మధ్యతరగతి వర్గాలు సంఘటితంగా పోరాడాలి; నిజమైన ప్రజాస్వామ్యం సాధనకోసం నడుం బిగిద్దాం; దేశ సంపదను విదేశీ గుత్తకంపెనీలకూ, సామ్రాజ్యవాదులకూ దోచిపెడుతూ పేద, ధనిక అంతరాలు పెంచి, నిరుద్యోగాన్ని పెంచిపోషిస్తూ, ప్రజలను బిచ్చగాళ్ళుగా మారుస్తున్న దళారీ పాలకుల విధానాల్ని తిప్పికొడదాం' అని ఏఐఎఫ్‌టియు(న్యూ)రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కామ్రేడ్స్ సి. పెద్దన్న, జె. కిషోర్‌బాబు పిలుపునిచ్చారు. ఈ పిలుపుమేరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కార్మికులు, రైతు-కూలీ శ్రామిక ప్రజలు చికాగో అమరవీరులను స్మరించుకుంటూ మేడే పతాకాలను ఆవిష్కరించారు.

'8 గం॥ల పనిదినాన్ని, కార్మికసంక్షేమ చట్టాలను అమలుపరచాలి; ట్రేడ్‌యూనియన్లు పెట్టుకోవడం కార్మికుల హక్కు. దీనిపై పాలకులు పెడుతున్న ఆంక్షలను రద్దుచేయాలి; కనీస వేతనం రూ.18 వేలు, కనీస పెన్షను రూ.6 వేలు ఇవ్వాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి; ప్రభుత్వరంగ పరిశ్రమలను, సంస్థలను అమ్మడం, నిర్వీర్యం చేయడం, ప్రైవేటీకరించడం ఆపివేయాలి. కార్మికుల, ఉద్యోగుల తొలగింపులు ఆపాలి.; ప్రభుత్వ రంగంలోని ఉద్యోగ ఖాళీలన్నింటినీ భర్తీచేయాలి.; తాత్కాలిక ప్రాతిపదికపై తీసుకునే కాంట్రాక్టు, కాజువల్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ పద్ధతిని రద్దుచేసి, శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించాలి. ఇప్పటికే ఈ పద్ధతిలో పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించాలి. సిపియస్‌ను రద్దుచేసి పాతపెన్షను విధానం పునరుద్ధరించాలి.; వ్యవసాయరంగాన్ని రక్షించాలి. బహుళజాతి కంపెనీల దోపిడీనుండి రైతాంగాన్ని రక్షించాలి. రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి.; వ్యవసాయాధారిత పరిశ్రమలను నెలకొల్పాలి. ఇప్పటికే వున్న వాటిని రక్షించాలి.; దళితులపై, మహిళలపై, మైనారిటీలపై దాడులనూ, హత్యాచారాలను అరికట్టాలి.' అని ఈ సందర్భంగా కార్మికులు డిమాండ్ చేశారు.

'అటవీ సంపదను దోచుకోవడంకోసం ఆదివాసీలను అడవులనుండి గెంటివేసే పాలకుల విధానాల్ని తిరస్కరించమని, కులవ్యవస్థ రద్దుకొరకు ఫ్యూడల్ సాంస్కృతిక మతభావాల నుండి విడగొట్టుకుందామని, అగ్రకులాలనబడే రైతుకూలీ పేదలకు-దళిత, నిమ్నజాతుల, కష్టజీవుల మధ్య వర్గఐక్యతను సాధిద్దామ'ని వారు నినదించారు.

ooooo